# కాలక్షేపం

[క థా ని క]

శ్రీ పంతుల శ్రీరామశాస్త్రి

'అసలు ఆడమనుషుల మాట వినడం నాదీ బుద్ధి తక్కువ' అన్నాడు వెంకటనరసింహంగారు, భార్య కామేశ్వరమ్మ తెచ్చిన మంచినీళ్ళయినా అందుకోకుండా! 'మన తాహతుకి వాడికి కాలేజీ చదువు చెప్పించడం ఏమిటి? స్కూలుఫయినల్ అయిపోగానే ఉద్యోగంలో కుదిరిస్తే ఈపాటికి మూడు ఇంక్రిమెంట్లు వచ్చిఉండును; ఆడవాళ్ల పెత్తనాలయితే ఇలాగే తగలడుతూ ఉంటుంది' అని, మరి ఏమీ అనడానికి తోచక కాబోలు మంచినీళ్లందుకొన్నాడు.

అతడు మంచినీళ్లు తాగి కొంచెం సర్దుకొన్నాక కామేశ్వరమ్మ అందుకొంది. 'వెళ్లివచ్చిన పని ఏమయిందో మంచీ చెడ్డా ఏమీ లేదు; వస్తూనే తిట్లు తిట్లు! అబ్బాయి దగ్గిర్నించిగాని ఉత్తరం వచ్చిందేమిటి?'

'ఏమో! ఇప్పుడిలా రైలు దిగివస్తున్నానుకదా నాకేం తెలుసును?—వస్తే ఇంటికే రావాలి. అబ్బే, వాడెందుకు రాస్తాడూ? నేను మొదట్నించీ అంటూనే ఉన్నాను. మొక్కయి వంగనిది మానయి వంగుతుందా, కాస్త ఇప్పుడే అదుపాజ్ఞల్లో ఉంచనియ్యే అని. నువ్వే వాడిష్టం వచ్చినట్టు తిరగనిచ్చేవు. ఇప్పుడు వాడు మన మాట వింటాడా? కొన్నాళ్ల పాటు అమ్మాయికయినా ఉత్తరం ముక్క రాసేవాడు. ఇప్పుడదీ లేదు. అవతల కాస్త డొక్క మాడేసరికల్లా ఓ, ఏంపోయించి చేసేస్తాడు వైరు—తానేమో ఇక్కడ మహా డబ్బు దాచిపెట్టి ఉంచినట్టు. ఇదివరకిలాగ రెండు మార్లయింది; ఇకమీదట, ఆపప్పుడకదు. డబ్బు లేకపోతే బైరాగీవాళ్ళు వచ్చినట్టు టిక్కెట్టు లేకుండా రావలసిందేగాని నేను మరొక్క దమ్మిడీయేనా పంపను.'

'ఇప్పుడు మిమ్మల్ని పంపమన్నవాళ్లెవళ్లు చెప్పండి? అసలు సంగతేమిటో తేలనియ్యకుండా మధ్య నీ రంధంతా ఎందుకు?'

'నీకు అలాగే ఉంటుంది. నాలా కష్టపడి ఆర్జిస్తే అప్పుడు నీకూ, నీకొడుక్కీ తెలిసిఉండేది. సరే, నీయిష్టం, నాకేం, ఉన్న బంగారం పిప్పి పిసరూ అమ్మి, వీడి చదువుకింద తగలేశాముకదా! ఇక నేమిటి పెట్టి చేస్తావో చెయ్యి కూతురిపెళ్లి. వాళ్లకి కట్నం వెయ్యిరూపాయలకి కానీ తక్కువయినా వల్లకాదట. తక్కిన లాంఛనాలూ అవీ ఒక అయిదు వందలతో సర్దుకొంటారుట పాపం. పైఖర్చులు ఎంత కష్టంగా చేసినా మరొక అయిదారువందలయినా కాకపోవుకదా! నావల్లకాదు బాబూ, ఎక్కణ్ణించి తెస్తావో, తే.'

'నే నార్జించేమాటయితే మీ ప్రాధేయమేం? అయితే, ఇంతా వెళ్లి వాళ్ళెంతంటే అంతే అనేసుకొని ఊరుకొన్నారా? కట్నమనుకొంటారో, లాంఛనాలే పెట్టుకొంటారో, వైభవంగా పెళ్లే చేసుకొంటారో, పదిహేనువంద లిచ్చేస్తాం; ఆ కాస్తా అయిందనిపించీండనలేదూ?'

'ఓ, అనడానికేం, అన్నిమాటలూ అన్నిరకాలుగానూ అన్నాను. రెండువేలకి తక్కువయే మాటయితే మరి మనం వేరే చూసుకోవలసిందేనని మధ్యవర్తి నిష్కర్షగా చెప్పేసేడు. అసలు అదైనా వాళ్ల అబ్బాయికి మన పిల్లమీద ఎంతో మోజు ఉండబట్టుట. లేకపోతే వాళ్లకి ఇంతకి రెండింతలు కట్నం వచ్చే సంబంధాలు అవతల సిద్ధంగా ఉన్నాయిట.'

'అదే నే ననేదీని. ఇప్పుడుజారవిడిచేసేమంటే ఇటువంటి సంబంధం మనం జన్మలో మరి చెయ్య

లేము. అసలు మనఅమ్మాయికికూడా ఆ అబ్బాయే నచ్చేడు. అందుకే నే నింతలా పోరుతున్నాను. తీరా పెళ్లి అటూ ఇటూ తేలకుండా సందిగ్ధంలో పడేసివచ్చే రన్నమాట?'

'హుఁ, ఇంత అవస్థపడినా నీ కలాగే ఉంది. తాంబూలా లిచ్చేసేను. ముహూర్తం కూడా ఈ మాఘంలోనే!'

'ఏమిటీ, ముహూర్తంకూడా రహితపరుచుకొనే వచ్చేరూ? అబ్బ! ఇంతసేపూ చెప్పేరు కారు. అమ్మయ్య! ఇప్పటికి ప్రాణాలు కుదుట పడ్డాయి. అయింతా వ్యవహారం మళ్లీ మొదటికి వచ్చిందికాబోలని భయపడ్డాను. అమ్మాయి, సుశీలా, సుశీలా, లేదు, కాంతంగారింటికి వెళ్లిందికాబోలు. లెండి స్నానానికి వేగం. ఇప్పటికే పన్నెండు దాటింది.'

'ఓహ్, ఏమి కులాసాగా ఉంది కామమ్మకి! కూతురికి పెళ్లయిపోతుందన్న కులాసావేగాని, తరవాత చేతికి చిప్ప వస్తుం దన్న జ్ఞానం లేదుకదా!'

'ఎప్పుడూ ఎందుకో అందుకు మీ కున్నదే ఇది. కాస్త మనిషికి సంతోషంగా ఉందా మనిపించ దేం ఖర్మమో! సుశీలమ్మపెళ్లయిపోతే ఇక మన కేం బెడద ఉంది చెప్పండి. మనిద్దరికీ దినమే గడవకపోతుందా? భగవంతుడే ఉన్నాడు.'

'ఆ భగవంతుడు డబ్బు ఖర్చక్కరలేకుండా నీకూతురుకి పెళ్లి చేయించరాదూ? ఇదివరకల్లా తిండీ బట్టాకూడా మానుకొని, కష్టార్జితం అంతా వాడి చదువుకింద పెట్టినందుకు వాడా వరసగాతయారయేడు. ఇక ఈ ముప్పై ఏళ్లు నౌకరీ చెయ్యగా మిగిలిన డబ్బు పెట్టి దీని పెళ్లి చేసేయమంటున్నావు. నీధైర్య మేమిటో నా కేం తెలుసును? ఇక మీదట నువ్వే నన్ను పోషించాలి.'

'అ దేమిటండీ అపభ్రంశపు మాటలు. ఈలోగా అబ్బాయి ఏదయినా ఉద్యోగం సంపాదించడా? అప్పుడు వాడు ప్రవేశించిన ఆ కంపెనీ ఎత్తిపెట్టే సేరుటగాని, లేకపోతే వాడి కీపాటికి డబ్బూ పేరూ ప్రతిష్ఠా వచ్చునటకదూ?'

'అలాగే నువ్వు మనసులో పాలు తాగుతూ ఉండు. మొదటిదానికి మొగుడు లేడు, కడదానికి కల్యాణం అన్నట్లు వాడికి నిత్యకృత్యానికీ, కని పెంచిన తల్లిదండ్రుల్ని పోషించడానికీ గతి లేక పోతున్నదిగాని, ఇక వీడు డబ్బు ఆర్జించడమూ, పైగా పేరూ ప్రతిష్ఠా సంపాదించడమున్నా? అవన్నీ శ్రీమంతులు చెయ్యవలసిన పనులు. సరే, నాకేం? ఉన్నమా టంటే మళ్ళను నీకు కోపం వస్తుందికూడాను. నువ్వే, పట్టుపట్టి ఈ సంబంధం చేయిస్తున్నావు. నీదే పూచీ. నేను మరి, ఇంట్లో సాపాటుకే తప్ప ఆఫీసులో పనికి పనికిరా ననేకదా రిటైరు చేసేస్తున్నారు. ఇకమీదట నువ్వే నడపాలి సంసారశకటాన్ని— ఎవళ్లింట్లో వంటలక్కగా ప్రవేశిస్తావో ఏం జేస్తావో నీయిష్టం—'

'ఎందు కిన్ని మాటలు? మీ కంత సరదాగా ఉంటే మీడబ్బు పెట్టుకొని ఊరేగండి. ఎదిగిన కూతుర్ని పెళ్లి చెయ్యకుండా ఇంట్లో ఉంచుకొందుకు నామర్దాగా లేకపోతే నాకేమీ?'

'ఇప్పు డీపెళ్లంటూ చేసేస్తే, తరువాత ఎటువంటి దైన్యం హైన్యం అనుభవించినా పరువే కాబోలు. కానీ, బుద్ధిః కర్మానుసారిణీ అన్నారు. రెండువేలు, పైని మరొక రెండువందలయినా చిల్లర ఖర్చు లయిపోతాయి. తరవాత మరి నా ప్రావిడెంటు ఫండులో ఒక్క వెయ్యికంటె మిగలదనీ, కూర్చొని తినేస్తే ఒక ఏడాదీ, ఏడాదిన్నరలో అయిపోతుందనీ నువ్వు బాగా తెలుసుకో!'

'ముందు శుభకార్యం చల్లగా కానిద్దురూ, తరవాత తెలుసుకోవలసినవేవో బాగా తెలుసుకుందాం. మీతో ఇదే చిక్కు. చేసేది అంతా చెయ్యడం, మళ్లీ నానామాటలూ అంటూఉండడమున్నూ. ఇలాటి మాటలంటారనే, అమ్మాయి పెళ్లేచేసుకోనంటున్నాది.'

'పోనీ, ఏఁవిఁటి నష్టం. మనతోపాటు హాయిగా ఉంటుంది, ఆమాత్రం చదువుకుంది, కావాలంటే ఏ స్కూలుమాష్టరుపనో చేసుకుంటుంది—ఆ వెధవ ఎలాగూ ఉండీ లేనిలో జమఅయిపోయేడుకదా!'

'ఏంఖర్మమో, ఎప్పుడూ నోట సున్నితమయిన మాట రాదుకదా! మీరు వస్తారని మూడు పూటలాయి వండుకొని బాగా రైలువేళ దాటిన, గంటవరకు చూస్తున్నాము. లెండి వేగం స్నానానికి. అదిగో అమ్మాయీ!, రా అమ్మా, మీనాన్న తాంబూలాలిచ్చేసేరుట—ఈవచ్చే మాఘంలోనే ముహూర్తం కూడానట'

సుశీల ఏమీ ఎగిరి గంతువెయ్యలేదు తల్లి అంత ఉత్సాహంగా చెప్పిన శుభవార్తను విని.

మధ్యాహ్నం అంతా ఒంటరిగా గదిలో తలుపు వేసుకొని కూర్చుంది.

అమ్మ కాఫీకి మూడుమార్లు పిలిస్తే వచ్చి తాగి వెళ్లిమళ్లీ ఎప్పటిలాగే కూర్చుంది.

రెండుమూడుమార్లు ఏవో పుస్తకాలూ పత్రికలూ చదవాలని తీసింది. కాని సాగలేదు. కిటికీలోంచి కనిపిస్తూఉంటారు వీథంట వెళ్లే మనుష్యులు. కనిపించినంతసేపూ అలా చూడడం, తరవాత మళ్ళీ కాంతంగారి వీథివాకలిలో ఉన్న కొబ్బరిచెట్టువంక చూస్తూఉండడం. గాలికి కొబ్బరిమట్టలు ఎంత చక్కగా కదుల్తాయి! అందులోనూ ఎండి పోయినవయితే మరీ ని. ప్రతిపర్యాయం గాలివేసినప్పుడూ, ఇక సరి, ఈమాటుతో పడిపోతుందనే అనిపిస్తుంది. కాని, ఎంత ప్రబలమయినదో దానిని చెట్టుకి కట్టి ఉంచిన శక్తి. మనుష్యులూ ఇంతేకాబోలు—గట్టిగా అంటిపట్టుకొన్న అలవాట్లనూ ఆచారాలనూ అవి ఎంత దుర్బలంగా అయినప్పటికీ వాటినే ఆలంబనంగా పట్టుకోవాలని చూస్తారు......

అలా ఒంటరిగా ఏపనీ చెయ్యకుండా కూర్చోడం సుశీలకు తనమీద తనకే కోపం వస్తుంది. ఛ. ఛ. ఏదో ఒకటి నిశ్చయించేసుకోవాలనుకొంటుంది. గంటలయితే త్వరత్వరగా పరిగెడుతున్నాయిగాని ఆలోచనమాత్రం ఎప్పటిచోటనే ఉన్నట్టుంటుంది.

ఒకక్షణంలో ఎన్నెన్నో చెయ్యాలన్న ధైర్యం, ఉత్సాహం. మరుక్షణంలోనే, తానువృథాగా గాభరా పడడం తప్ప చేయగలిగిందేమిటే అని నిస్పృహ, నీరస భావమున్నూ—

అన్నయ్యంటే మగవాడుగనక వెళ్ళిపోయి, ఎన్ని శ్రమదమాదులయినా పడి, స్వేచ్ఛగా బ్రతకగలుగుతున్నాడు. ఎప్పటికయినా గొప్పవాడు కాగలడు. కాని, తన కదంతా సాధ్యమవుతుందా?

కావాలంటే అన్నయ్య ఈనాడు తిరిగివచ్చి 'ఏమిటో అవోకసరదాలు పోనిద్దురూ' అని మామూలుగా ఉద్యోగం చేసుకొంటే నలుగురూ భేష్ భేష్ అంటారు. అధమం పెద్ద వింతగా చూడరు. నిక్షేపంగా పెళ్ళిచేసుకొని నిర్విచారంగా ఉండగలడు. కాని, తాను ప్రపంచంలో ఒకమారు స్వతంత్రించి కాలు పెట్టేక మళ్ళీ వెనక్కు తీసుకోబడుతుందా? ఒకమారు ఇంట్లోంచి వెళ్ళిపోతే అంతే, కష్టమో సుఖమో, లేకుంటే చావో అంతేతప్ప మళ్ళీ పెళ్ళి చేసుకోవడం, సంసారం నిర్వర్తించడం మరి జరగడానికి వీల్లేదు.

అలాగని ఇప్పు దూరుకుంటే నాన్నప్రావిడెంటుఫండంతా తన పెళ్ళికింద ఖర్చయిపోయి, తల్లీ మానాన తను అత్తవారింటికి వెళ్ళిపోతే అమ్మానాన్నా గతి ఏంగాను? ఈవయస్సులో నాన్న మళ్ళీ ఉద్యోగం సంపాదించి ఆర్జించగలరా? అన్నయ్య ఉంటే ఏబాధా లేకపోవును, నిజమే—

కాని, అన్నయ్య ఏం తెలివితక్కువవాడు కాడు. ఈనాటి మహానటులపాటి సామర్థ్యం లేదా? లేకేం, ఉంది. అయితే తను చెప్పినట్టు ప్రతిదానికీ సమయం సందర్భమూ కుదరాలి; ఈలోగా వెక్కెత్తిపోయినందువల్ల ఫలితం ఏమీ ఉండదు. అయితే ఇప్పుడెన్ని చిక్కులు పడుతున్నాడో—పడితేనేం, ఎన్ని అవస్థలు పడందీ ఇప్పుడు గొప్పవాళ్ళయినవాళ్ళు ఈ స్థితికి వచ్చేరా?

సుశీల కేవలం తనగురించీ, తాను ముందు అనుసరించవలసిన కార్యక్రమంగురించీమాత్రమే ఆలోచించాలనుకొంటుంది. కాని, ఆలోచన తనకు తెలియకుండానే తక్కిన అన్నిటిగురించీ, ముఖ్యంగా అన్నయ్య రాఘవరావుగురించే ప్రసరిస్తుంది.

నిజంగానే నాన్న చెప్పినట్టు అన్నయ్య జీవితాన్ని తెలివితక్కువగా పాడుచేసుకొంటున్నాడా?

ఊహుఁ, ఏముంది, ఇలాగే నాన్న చేసినట్టూ, ఏ గుమాస్తాపనో, లేకపోతే బి.యే. వరకూ చదివేడుగనక బడిమాష్టరుపనో చేసుకొని అతికష్టంమీద నిత్యకృత్యం వెళ్ళబుచ్చుతూ ముసలివాడైపోతే ఏముంది? ఇప్పుడల్లా ఎన్నికష్టాలు పడితేనేం ? ఎప్పటికయినా అన్నయ్య డబ్బూ, పేరూ, ప్రతిష్ఠా సంపాదించగలిగితే అవి తమవి మాత్రం కావేమిటి ? కళకికూడా కొంత త్యాగం చెయ్యాలి—అయితే నాన్న కిదంతా అర్థంకాదు. అన్నయ్య ఏమో పూర్తిగా చెడిపోయేడనీ, ఎందుకూ కొఅగానివాడయిపోయేడనీ ఆయన నమ్మకంలో. సుశీల తనకి తెలియకుండానే అన్నయ్య, రాఘవరావు అభిప్రాయాలను చాలావరకు స్వంతంచేసికొంది.

కాని, అంత నిబ్బరంలోనూ అనుమానధూమం లేకపోలేదు. అన్నయ్యను సరిగా అర్థంచేసుకోక పోతేనేం, నాన్నమాటలలోనూ కొంత యథార్థం లేకపోలేదు. పాపం, ఇన్నాళ్లూ అన్నయ్యమీదనే తమ ఆశలన్నీ పెట్టుకొని ఉన్నారు అమ్మా నాన్నాను. ఇప్పుడు నాన్న ఉద్యోగం చెయ్యదల్చుకొన్నా మరి దొరకదుకదా, ఉన్నది కాస్తా తన పెళ్లికింద అయిపోతే, తరవాత వాళ్లని చూసేదెవళ్లు ?

తాను పెళ్లిచేసుకోకుండా ఉండిపోయి, ట్రెయినింగయి ఏస్కూలుమిస్ట్రెసు పనో సంపాదించగలిగితే—బాగానే ఉంటుంది. ఏమిటి నష్టం—అదే బాగుంటుందేమో ? కాని, అమ్మ తనమాటే చొరబడనివ్వదు. ఎంతసేపూ తన పెళ్లిప్రయత్నాలూ తానూ, మరి తక్కిన ప్రపంచంగొడవే అక్కరలేదు.

పోనీ ఎవరికీ చెప్పకుండా ఎక్కడికయినా వెళ్లిపోతే?—అమ్మా నాన్నా దుఃఖానికి మేర ఉంటుందా ? వాళ్ల తృప్తి మాత్రం తనకు అక్కర్లేదా ?

అలా సుశీల ఆలోచన ఇంకా తెమలనేలేదు—రోజులుమాత్రం తొందరగా తిరిగిపోతున్నాయి.

ఎన్నోరాత్రులు నిద్రపోకుండా తొమ్మిదీ—పదీ—పదకొండు—పన్నెండు అలా గంటలు వింటూ పడుకొనేది. అప్పుడప్పుడు వీధిలో ఎవరో నడుస్తూండేవారు. శాస్త్రిగారి అమ్మాయి సంగీతసాధకమూ, వెంకట్రావుగారింట్లో గ్రామఫోను - ఇవి ఎప్పటిలాగే ఉన్నాయి. సుశీల ఆలోచనా అంతే—

అప్పుడప్పుడు పక్కమీదనుండి లేచి, వీధి గుమ్మంలోకి వచ్చేది. పట్టపగలే ఎక్కువ జనసమ్మర్థంగా ఉండని ఆవీధి, రాత్రి, కొరివిదయ్యాలవంటి ఎలెక్ట్రికుదీపాల వెలుగులో మరీ నిర్మానుష్యంగా, వింతదేశంలో భాషరాని ఒంటరి మనిషిలా కనిపించేది. ఇలా తను బయలుదేరి ఎంతవరకూ వెళ్లగలదు ? ఒకటి, రెండు, మూడు, నాలుగు, అయిదు, ఆరు, ఏడు, ఎనిమిది, తొమ్మిది దీపాలు వరసగా ఉన్నాయి. అక్కడివరకూ తను నిబ్బరంగా తిన్నగా వెళ్లగలదు. తరవాత మూడురోడ్లు కలుస్తాయి. ఎటువెళ్లడం ? ఏమిటి చెయ్యడం ?—అబ్బే, తానేమీ చెయ్యలేదు. నిజమే—మళ్లీ తలుపు భద్రంగా వేసివచ్చిపడుకొనేది సుశీల.

ఎక్కువగా అటూ ఇటూ ఆలోచించి, అన్ని పరిస్థితులనూ, అందరు మనుష్యులనూ సవ్యంగా పొరపాటులేకుండా అర్థం చేసుకోవాలన్న మనుష్యులు స్వయంగా సాహసించి ఏపనీ చెయ్యలేరు.

సుశీలకి తాను స్వయంగా ఏమీ చెయ్యలేకపోయినా, లోపల్లోపల ఏదోఒకమాదిరి బెంగా, అందుకు విరుగుడుగా అన్నయ్యనుగురించిన ఆశాలేశమూ కదలాడుతూ ఉండేవి. ఈపగటిబండిలో రాకూడదా, లేక అమ్మా నాన్నా నిద్రపోయినప్పుడు రాత్రి మెల్లగా తలుపు పిలవకూడదా ? ఏమో ఈసరికి ఏరెండుమూడు వేలో అయినా ఆర్జించి ఉండకూడదా అని—అన్నయ్యది అంత తేలికగా బైటపడే స్వభావం కాదు; కిందటిమారు నాన్నతో దెబ్బలాడి వెళ్లిపోతున్నప్పుడు ఒక్క తనతోనే అన్నాడు—'ఈయన మహా నాచదువుకింద ఖర్చు పెట్టేసినదెంత ? మూడువేలకంటె ఏవిధంగా లెక్కపెట్టినా ఎక్కువ ఉండదు. అధమం ఆమూడు వేలయినా ఆర్జిస్తేనేకాని, ఈ గుమ్మంలో మళ్ళీ అడుగు పెట్ట' నన్నాడు. నిజంగా అన్నంతపనీ చేసితీరుతాడు అన్నయ్య ఈ పెళ్ళి అయే

లోపునే రాకూడదూ—వస్తే. అతడు డబ్బు సంపాదించగలిగినా లేకపోయినా సుశీల ఆనందానికి అవధి ఉండకపోవును. కాని, రావడానికి, పాపం రయిలు ఖర్చులన్నా ఉంటేకదూ రాఘవరావు జేబూలో—

నాన్నకే కష్టమనిపించింది. 'ఎడ్రసు తెలిస్తే బాగుణ్ణు, ఒకపాతికరూపాయిలు మనియార్డరు కడితే, ఈ పదిరోజులూ వాడింట్లో ఉంటే నిండుగా ఉంటుంది' అన్నారు.

అమ్మ బైటికి ఏమాటా అనదుగాని, లోపల్లోపల తనకంటె పదింతలు బాధపడుతూంది.

ఇక మరొక్క వారంరోజులే. రాలేదు, రాలేదు, రాలేదు, ఇక మరి రాడేమో, నాన్న ఉత్తరం అందలేదుకాబోలు.

పెళ్లి సలక్షణంగానే జరిగిపోయింది. మధ్యవర్తి హడావిడేతప్ప, వాళ్లూ సౌమ్యులులాగే ఉన్నారు. లాంఛనాలూ మొదలయినవాటిలో అంత పట్టుదల పట్టలేదు. అసలు పెళ్లికొడుక్కి—ఇంకా పెళ్లికొడుకేమిటి, ఆయనకు—తనను చూసినతరవాత తక్కిన సంబంధాలగురించిన ప్రసక్తే మరి ఇష్టపడలేదట—ఇదీ అదృష్టమే—

ఆయనకు శలవు లిచ్చేవరకూ ఈఒక్కనెలా పుట్టింట్లో ఉంచడానికి సమ్మతించేరు—ఈనెల్లాళ్లలోనయినా అన్నయ్యవస్తే—ఎంత తృప్తిగా ఉండును తనకు—కాని, రాలేదు. అక్కడ ఏమి ఇబ్బంది పడుతున్నాడో ?

## ౨

పాతఅలవాటుచొప్పున బస్సుస్టేండు దగ్గరకి వచ్చేసరికి రాఘవరావుకాళ్లు నిలిచిపోయేయి. కాని, అంతలోనే అప్రయత్నంగా చెయ్యి జేబులోకి వెళ్లింది. ఒక్కరూపాయీ రెండుఅణాలూమాత్రమే ఉన్నాయి. అతని చేతికిమాత్రం తెలీదేమిటి, అదివరకప్పుడే మూడునాలుగుమార్లు లెక్కపెట్టడం జరిగింది, ఆఖరుఅయిదురూపాయిల నోటు మార్చినదగ్గరనుండి. తానుమాత్రం ఏం ఖర్చుదారుగా ఉంటున్నాడా ? లేదే, ఏలున్న విషయాలన్నిటిలోనూ అతిపొందికగానే వ్యవహరిస్తున్నాడే.

విడిగా ఉన్న రెండణాలూ బస్సుకి అయిపోతే, ఉన్న ఒక్కరూపాయీ అత్యంతఉత్తమమయిన విధానాన్ని ఉపయోగించాలి.

అతను స్ఫుటంగా అనుకోకపోయినా, తండ్రికి టెలిగ్రాము చెయ్యడం అన్నది నిశ్చయం అయిపోయినట్లుగానే లెక్కించసాగాడు. ఎంతవుతుంది, రూపాయికంటె ఎక్కువ కాదు. ఏముందిగనక. 'ఒక యాభైరూపాయిలు పంపాలి. బయలుదేరివస్తున్నాను.' అంతే. కాని, ఒక ధర్మసూక్ష్మం ఉంది. ఇప్పుడు పోస్టాఫీసుకి ఇట్నించి బస్సుమీద వెళ్లిపోతే రాత్రితిరుగులలో నడిచి రావడం అంత తేలికయిన పని కాదు. అంచేత ఉత్తమపద్ధతి ఇప్పుడే నడిచిపోవడం. ఇంతకీ తన కేం తొందర లేదు; వెళ్ళవలసింది పోస్టాఫీసుకే కదా ! ఒక మైలున్నరకంటె ఎక్కువ ఉండదు. ఆమాత్రం నడవడమూ మంచిదే. ఈమధ్యన తిండి సరిగా అరగడంలేదు.

అతనికి తిండిమాట జ్ఞాపకం వచ్చేసరికి ఆలోచన మళ్ళీ పక్కదారి తొక్కింది. ఈఒక్కరూపాయీ ఇప్పుడు వైరుచెయ్యడానికి ఉపయోగించేస్తే, హోటలుటిక్కెట్లు మరి లేవుకదా. ఈఒక్కపూటకీ అయితే బాధ లేదు. పరబ్రహ్మస్వరూపుడు ద్రావిడదేవుడు పర్సు మరిచిపోయినా నంటే అడ్డు చెప్పడు. కాని, రేపటిమాట ఎలాగ ? నాన్న సరిగా వేళకి ఊళ్ళో ఉండాలి. ఉన్నా ఆయనకి టెలిగ్రాము మనియార్డరు ఆవశ్యకత బోధపడుతుందా ? చూస్తూ చూస్తూఆయన *T.M.O.* చెయ్యగలరా సుమారు మరొక రూపాయి ఖర్చుపెట్టి—యాభైరూపాయిలు ఖర్చవడానికి అభ్యంతరం లేదుగాని, తనచేతితో మరొక రూపాయి ఖర్చవడం అంటేమాత్రం ఇష్టపడడు. ఏమో పంపిస్తారనిమాత్రం నమ్మకం ఏమిటి ? పరిస్థితులు అన్నీ విశదంగా రాస్తేనేగాని దమ్మిడీయేనా పంపనంటే, తన అవమానమే మిగులుతుంది.

గురుమూర్తి ఇవాళ తప్పక ఎంతో కొంత జేబులో వేసుకొని వస్తాను చూడన్నాడు. ఏమిట్లో

వాడి నిబ్బరం. వాడే అదృష్టవంతుడు. వాడికీ నెల జీతం అని నిలకడగా లేకపోయినా, ఎంతో కొంత, ఎప్పటికప్పుడు సద్యఃఫలితం. తనకీ అంత అన్యాయం లేదు. ప్రతీనెలా ఎక్కడో ఒకనాటకం బేరం తగలక పోదు. కాని, ఏమిటి ఫలితం ? ఎంత బేరం చేసి పుచ్చుకొన్నా ఖర్చులకే సరి. మళ్ళీ తిరిగివచ్చేసరికి ఒక పది రూపాయిలు మిగలడమే గగనం—

కామేశ్వరరావు ఇంటిదగ్గర ఉంటాడేమో ? ఈ మధ్యనల్లా కనబడడమే లేదు. ఆ పాతికా పుచ్చుకొనేదాకా, రెండురోజులూ లాడ్జి అరిగిపోయేలాగ తిరిగేడు. తరవాత తానూ రెండుమూడుమార్లు పెద్ద మనిషితరహాగా పాతబాకీ ఊసెత్తకుండా, ఏదో తాత్కాలికపు అవసరం ఉన్నట్టు, 'ఒక పదిరూపాయిలుంటే చూద్దూ, తరవాత మళ్ళీ చూసుకొందాము' అనకపోలేదు. ఏం లాభం? ఇచ్చేదీ లేదు, చచ్చేదీ లేదు గాని, అది కృతజ్ఞతో, వెటకారమో, పాత కథంతా ఏకరువుపెట్టడం, ఇక ఇంటద్దె సరిగా చెల్లించలేకపోవడం, ఇన్సూరెన్సుకి ప్రీమియం చెల్లించలేకపోవడం, ఏవేవో తప్పనిసరి మందులు కొనడానికి నానాఅవస్థలూ పడడం అన్నీ వల్లెవేస్తాడు. అయితేనేం, ప్రస్తుతం చివరిమారుగా ప్రయత్నించడం తన విధి. ఈపాటికి ఆఫీసునుండి వచ్చిఉంటాడేమో. పోస్టుకేం తొందర మించిపోలేదు. గురుమూర్తికూడా సాయంత్రానికి కదా బీచిలో తేల్తానన్నాడు. ఏమో ఛాన్సు ఎలా ఉందో ? తనకుకూడా జేబు బరువెక్కే యోగం ఉందేమో ! అనుకొంటూ అడ్డుదారి పట్టేడు రాఘవరావు.

మొట్టమొదటి నాడు కామేశ్వరరావు ఇంటికి వెళ్ళిననాడు తాను పెద్ద కథానాయకుడు. కాడా మరి? తొలినాటిరాత్రి కన్యాశుల్కంలో తన అద్వితీయనటనను చూసి పురప్రముఖులందరూ మెచ్చుకోబట్టికదా, కామేశ్వరరావుకి తనలోని మహత్తు తెలియడం. మర్నాడు వాళ్ళింటికి వచ్చేదాకా చంపేశు. అవునుమరి, తనగురించి తోడి ఆఫీసుగుమాస్తాలూ వాళ్లూ అనుకునేటప్పుడు, ఏదో పరిచయమేకాదు, తన ఇంటికి వస్తూపోతూ ఉండడం అలవాటున్న ఆప్తమిత్రుడని చెప్పుకోవాలి. ఆభృగువు అలా ఉండిపోయిఉంటే ఎంత బాగుండును ? మధ్య నీ ఆర్థికమయిన చిక్కు ఒకటి ఎందుకు వచ్చిపడాలీ ? అసలు వాడడగగానే తనుమాత్రం ఎందుకివ్వాలీ ? ఏమిటి, తనకు చేతిలో లేకపోతే ఇంకొకడి దగ్గర అప్పుచేసి అయినా ఇవ్వవలసినంత అగత్యం ఏమి వచ్చింది ? వాడు మనని గొప్పవాడనుకొంటున్నాడు కదా, ఆగొప్పని అలా అలా నిలబెట్టుకొని రావాలి. జారి పోనియ్యకూడదన్న తాపత్రయమేకదా ! తాను గొప్ప నటుడయినంతమాత్రంలో (అదీ ఇప్పుడనుమానమే) తన జేబులో డబ్బు ఉండితీరాలన్న నిర్బంధం ఏమిటి ? కామేశ్వరరావుకి మాత్రం తెలీదేమిటి ? తెలుసును. అయితే అంతకంటె నిబ్బరంగా తెలుసును, తను పొగడ్తకి లొంగిపోయే మనిషని. ఆదౌర్బల్యాన్ని వాడు చక్కగా వినియోగించుకోగలిగేడు. ఏమయితేనేం, ఇప్పుడెందుకు గతజలసేతుబంధనం ? తాను ఇవ్వడం, వాడు పుచ్చుకోడం జరిగిపోయింది. ప్రస్తుతస్థితిలో తనకి అత్యవసరంగా ఉంది గనక, అది ఎలాగోలాగు తిరిగి రాబట్టడం తన విధి. తాను ఎన్ని పాతికలీ విధంగా ఖర్చుపెట్టలేదు. అయితే ఇప్పటి స్థితిగతులింత ఒడిదుడుకుగా ఉండబట్టి ; లేకపోతే తాను మాత్రం ఒత్తిడి చేసేవాడా ?

ఆవిడ వాడి భార్య సుభద్ర కాబోలు, మొదటినాడు ఎంత మర్యాద చేసింది ? తరవాత రెండవ మాటు తనంతట తను వెళ్లినప్పుడుకూడా బాగానే జరిగింది. మూడవమాటు తన రాకకు కారణం కామేశ్వరరావువల్ల తెలిసిపోయింది కాబోలు, పిలుస్తున్నది తనేఅని తెలిసికూడా అమ్మాయి చేత నాన్నగారు లేరనిపించింది. ఆమాట తానే స్వయంగా చెప్తే ఎంత బాగుండేది ? ఎందుకు చెప్తుంది ? తాను అతిక్షుద్రంగా ఒక ముష్టి పాతికరూపాయిల చేబదులు వసూలుచేసుకొందికి ముప్ఫైమార్లు తిరిగిన కాబూలీవాలా ఆయను. ఆహా ! మహానటచక్రవర్తీ, నీవంటి షైలాకుతో ఆవిడ ఎందుకు ముఖాముఖిని భర్త లేడన్నమాటమాత్రం అంటుంది ?

ఈ జ్ఞాపకా లన్నిటితోనూ, రాఘవరావుకి ఇంటిని సమీపించేక పిలవకుండానే తిరిగిపోవా లనిపించింది. కాని, లోపల్లోపలనుండి చిన్న ఆశాలేశం. ఎలాగూ వాళ్లు తనను మహాగొప్పగా చూడడం లేదు. ఒకవేళ వాడు ఇంట్లో ఉండకూడదా, ఇక వీడు మరి వదిలేరకంలా లేదురా అని కొంతయినా దులప కూడదా? ఒక పది పెగిలినా మంచిమాటే. అయిదారు రోజులవరకూ కాస్తుంది. గురువూర్తికూడా సార్థకంగా ఇవాళ తిరిగివస్తే మరికొన్నాళ్లవరకూ పూచీలేదు. తరవాతసంగతి అట్నుంచి నరుక్కు రమ్మన్నారు. అని మనస్సమాధానం చేసుకొని, గొంతు సర్దుకొని, ధాటీగా, అలాగని మృదువు చెడకుండా 'కామేశ్వర్రావ్, కామేశ్వర్రావ్' అని పిలిచేడు.

'లేరు. ఇప్పుడే అలా ఎక్కడికో వెళ్లేరు. ఆ వేళ మీరు వచ్చి వెళ్లిపోయేరట (అమ్మాయికి తెలియక చెప్పేసింది). అంతలోనే ఆయన వచ్చి ఎంతో విసుక్కొన్నారు, ఉండమనలేకపోయేవా అని.'

ఈవిడధోరణిలో ఏం భేదం లేదు. తనమనస్సే చెడ్డది. పాపం, ఇంటిపనిలో ఉందికాబోలు, మాసిన చీరను చూసుకొని సిగ్గుపడుతున్నట్లుంది. తన బట్టలు మాత్రం ఏం బాగున్నాయిగనక? ఒకమారు నలిగిపోయేయని విడిచిపెట్టినవేకదూ. తక్కినవి ఇంతకంటేకూడా మురికిఅవడంవల్ల తారతమ్యదృష్టిలో ఇవే బాగున్నాయనుకోవలసివచ్చింది. ఆవిడని అనవసరంగా నిలబెట్టడం మంచిమాట కాదు. ఎంత సేపట్లో వస్తాడో, ఏమో ఆవిడ కేం తెలుస్తుంది? అయినా అడగడం తన విధి.

తన అనుమానమే నిజం. ఏమో వస్తే ఒక గంటలో తిరిగిరావచ్చునుట; లేకుంటే ఎవరో స్నేహితుణ్ణి కలియాలిట; కలిస్తే సినీమాకి వెళ్లివస్తారేమోనట. కాని, తను వచ్చిన పని ఇవాళ కొంతయినా చెయ్యందీ వెళ్ళకూడదు. 'మరేమంత విశేషం పనిలేదు. ఈ చీటీ ఇచ్చెయ్యండి' అని అలాగే నిలబడి రాసిఇచ్చేడు.

మళ్లీ నడక అందుకొన్నాక, తన చలాకీ, లేక పెంకితనానికి తనకే నవ్వువచ్చింది. తా నెందుకు చీటీ ఇంగ్లీషులో రాయలేదు? ఆవిడకు ఒకవేళ ఇంగ్లీషు రాకపోతే, వాడు మరేదో కారణం చెప్పి అడ్డుగా దమాయించేయవచ్చును. శుద్ధతెలుగులో, వీలయినంత స్ఫుటమయిన అక్షరాలతో, కావలసినంత వైదికంగా రాసేడు. ఒకవేళ ఆవిడ చదవకపోతే, తన పెంకెతనం ఏమయినట్టు? ఆఁ, ఏమిటి, చదవకపోవడానికి ఈవిడమాత్రం స్వర్గంనుండి దిగివచ్చిందా? ఏమధ్యతరగతిఇల్లాలు భర్తకి ఉండుకొంటున్న లావాదేవీల గురించి, ఉత్తరప్రత్యుత్తరాలగురించీ తెలుసుకొందికి కుతూహలం చూపకుండా ఉండగలదు?! కాని తీరా చదివేక, ఆవిడ తన బాకీ తొందరగా తీర్చివేయమని భర్తకి సలహాచెప్పడానికి బదులు, తనను అసహ్యించుకొంటుందేమో? తన భర్త అనే లోకైకపూజ్యపురుషుణ్ణి ఒక చిన్న చేబదులునిమిత్తం వేధిస్తున్న దుష్టప్రకృతిగా తనను భావిస్తే! భావిస్తే భావించనీ, తనకు ములిగిపోయిందేమిటి? తానేం ధర్మార్థంగా ఇమ్మనలేదు; అధర్మంగా ఒత్తిడిచెయ్యలేదు; కాస్త సధర్మంగా జ్ఞాపకం చెయ్యడమూ తప్పేనా? అని అటూ ఇటూ ఊచి ఊచి తన ప్రవర్తన అంతా మొత్తంమీదనే కాదు, చిన్నచిన్న అంశాలలోకూడా ధర్మమయినదనే తృప్తికరమయిన నిర్ణయానికి వచ్చేడు పోస్టాఫీసుని సమీపించేసరికి రాఘవరావు. తమలో తమకు అవినాభావసంబంధమూ, అభేదాధ్యవసాయమూ కలిగిన జేబూ, శరీరమూ రెండూ చిక్కిపోయిన సందర్భంలో ఎన్ని కబుర్లు చెప్పినా వాటిమీద ఆధారపడడం తప్పనిసరైన మనస్సుకి ఆత్మోత్కర్ష చేసుకొనేపాటి సావకాశం అయినా లేకపోతే మరీ కష్టంగా ఉంటుంది!

తనకి నిజంగా ఒక్కటే కావలసినా ఎంతో వ్యాపారపు తొందర ఉన్నట్టు మూడు టెలిగ్రాముఫారములు తీసుకొని, ఖాళీగా ఉన్న బెంచీమీద కూర్చొని రాయడం మొదలుపెట్టేడు.

ఎంత? కేవలం ప్రయాణానికయితే ఒక పదిహేను చాలును. కాని బాగుంటుందా, తాను ఏకంగా వెళ్ళిపోతూ చిల్లరబాకీలు తీర్చకపోవడం—అంతా ఒక ముప్ఫైకంటె ఎక్కువ ఉండవు. తా నక్కడకు

వెళ్ళి పంపడని కాదు, ఈలోగా వాళ్ళు దురభిప్రాయపడవచ్చును. రాఘవరావుకి తనలో తనకే నవ్వు వచ్చింది; ఒక్క అయిదునిమిషాలక్రితం కామేశ్వర్రావు, వాడి భార్య తనగురించి ఏమనుకొంటే అనుకోనీ అనుక్నాన్నాడు. మళ్లీ, ఇంతలోనే ఇలా తాను ఒకళ్ళేమనుకొంటారో అని జంకుతున్నాడు.

కొంతసేపు అలా కూర్చున్నతరువాత అతని దృష్టి మళ్లీ చేతిలోని టెలిగ్రాముఫారంమీద పడింది. మళ్లీ మొదటి ప్రశ్నే. ఎంత? తాను ఓడిపోయినట్లుగా ఒప్పుకొని, వెళ్లిపోయి, బుద్ధిగా నాన్న చెప్పినట్టు నౌఖరీ చేసుకునే మాటయితే ఈ చిల్లర అప్పులు తీర్చడానికయినా ఎంతో కాలం పట్టవచ్చును. ఎదురుగా తాను ఉండి అడిగితే నాన్నదగ్గరనుండి దమ్మిడీయేనా రాదు. అసలు ఎంత అవసరంగా ఉందని ఉత్తరం రాసినా డబ్బు ఊడిపడుతుం దన్నది సర్వాబద్ధం. ఒక్క టెలిగ్రాముకే ఆ శక్తి ఉంది. అయితే మొత్తం పదిహేను ముప్ఫై నలభైఅయిదు, ఎందుకయినామంచిది మరొక అయిదు యాభయ్యా పూర్తిగా పంపమనాలి. అక్కడికి మద్రాసుతో తనకు మరేమీ లావాదేవీలు ఉండవు. తానొక బి. యే. సగం పాసయి మానివేసి నాట్యకళ అనే ఎండమావులవెంట కొంతకాలం పరుగెత్తి బుద్ధి తెచ్చుకొని కడుపులో చల్ల కదలకుండా, అంటే కడుపులోకి చల్లటి చల్లకూడా చాలినంత లేకుండా, మప్పితంగా నిత్యకృత్యాన్ని నిర్వహించుకొని వచ్చే గుమాస్తామాత్రుడుమాత్రమే.

సరే అదంతా సుదూరభవిష్యత్తు. కాని, వర్తమానంలో ఒక గట్టి చిక్కుంది. నాన్న ఒక్కమారుగా చూస్తూచూస్తూయాభైరూపాయిలు చేతులారా పంపగలడా ? ఏమో, సరిగ్గా రైలుటిక్కెట్టూ పైఖర్చు మరొకరూపాయీ లెక్కపెట్టి పంపి, ముందు ఇక్కడికి వస్తే తక్కినవాటి సంగతి తరవాత చూసుకొందామంటే—అందులో ఏం విశేషం లేదు. తీరా వస్తున్నానని వైరు చేసి డబ్బు తెప్పించిన తరవాత మరి బయలుదేరకపోవడం ధర్మం కాదు. కిందటి మాటుకే అమ్మా చెల్లెమ్మా ఎంతో చిన్నబోయేరుట. పాపం, సుశీల ఎంత ఇదిగానో రాసింది. నువ్వొక్కమారు రాకూడదా అన్నయ్యా ? నీఖర్చులకి కావలిస్తే, పోయిం దని చెప్పి నాచేతిగా జోకటి ఇచ్చేస్తా నంది. పాపం, ఏమిటో వెఱ్ఱి అభిమానం ! కాని తీరా వెళ్లి చెయ్యగలిగిం దేమిటి ? వాళ్లను తృప్తిపరచడానికి బదులు మరింత వ్యాకులపరచడమే జరుగుతుందేమో ? తనకీ గుమాస్తాగిరీకీ నడుమ పచ్చగడ్డి వేస్తే భగ్గుమండుతుంది ; నాన్న కదే దేవేంద్రవైభవం. చెల్లెమ్మ పెళ్లి ఉత్తరం అయినా వేళకు అందిందికాదు. ఆ మిష పెట్టుకొని అయినా వెళ్లి కొంతకాలం ఉండిపోవడం జరిగి ఉండును. వాళ్ల కేం తెలుసును, తను క్రిందటి మారు ఉత్తరం రాసినప్పటికీ ఇప్పటికీ మధ్యను నాలుగయిదుమార్లు తన ఎడ్రసుమారిందని.

అయితే ఇప్పుడు తను యాభై అని వైరుచెయ్యడమే తప్ప, అట్నించి ఎంత వస్తుంది అన్నది అనుమానాస్పదమే. కాక, తను ఇప్పుడంత మహాప్రమాదమయిన పరిస్థితులలో లేడే. ఇప్పుడు గురుమూర్తి ఏదో కొంత సేకరించుకొనివస్తే, అదవేలోపున తనకు మరేదయినా పిలుపు రావచ్చును. ఏమో, ముందు ఏవిధంగా జరగనుందో ఎవడు చెప్పగలడు? ఇంతలోనే తానెందుకు ఓడిపోయినట్లు ఒప్పుకోవాలీ ?.........అలా అలా కూర్చోడంతో, మొదటి ఎంత ? అన్న శంక ఇప్పుడు మరి కాస్త విస్తరించి, అసలు టెలిగ్రాము ఇవ్వడమా ఇవ్వకపోవడమా అన్నంత మేర వ్యాపించింది.

ఈలోగా పోస్టాఫీసు గడియారం నిలిచిపోయిందా ? లేదే, ఎప్పటిరీతినే పరిభ్రమిస్తున్నది. ఎందరో వస్తున్నారు. ఎన్నెన్నో పనులు చేసుకొనిపోతున్నారు. ప్రక్కను కూర్చున్న ఒకరిద్దరు తగుమనుష్యులు 'ఒక్కక్షణం' అని ఒక అయిదేసి నిమిషాలు పదేసినిమిషాలు తన ఫౌంటెన్ పెన్ను ఎరువు పుచ్చుకొంటున్నారు. కొందరు ఏవో ఎడ్రసులూ మనియార్డరుఫారములూ తనచేత నింపించుకుంటున్నారు. కాని, ఎంతకీ తన ఆలోచన తెమలలేదు. గంటపైగా అయింది తా నలా కూర్చొని. మరి లాభం లేదని చటుక్కున యాభై అని రాసి లేచేడు. ఎవళ్ళో అయిదారుగు రున్నారు 'క్యూ'లో. హుఁ, ఇప్పు డేమిటి తొందర? గురుమూర్తి ఎంతో తనకు నిబ్బ

రంగా లేందీ అలా అనడు. అయినా తా నెందుకు తొందరపడడం? ఆ తెనాలివాళ్ళదగ్గరనుండి ఈ వారం లోగా ఏదో రావాలికదా!

కాకపోయినా ఈ పోస్టాఫీసుపరిసరాల్లో ఆలోచన తెమలదు. సముద్రపుఒడ్డున కూర్చొని గురుమూర్తితో కలిసి సావధానంగా ఆలోచించాలి. 'సహసా విదధీత నక్రియా మవివేకః పర మాపదాం పదమ్' అని కదా వ్రాసిచ్చినాడు భారవిమహాకవి—'అనుకొంటూ పోస్టాఫీసు దాటి బైటపడ్డాడు.

తనకయితే సహనంలోను శాంతంలోను ఉన్న గొప్ప తెలుసునుగాని, ఈ వెధవశరీరానికి ఆ విశ్వాసం ఉన్నట్టు లేదే—మరీమరీ వెనకాడుతూంది. ఒక్కపూట తిండి లేకపోయేసరికల్లా ఇంతలా అయిపోవాలా? మధ్యాహ్నం ఒక్కపూట తిండే కాదు, ఉదయం టిఫినుకూడా తిన్లేదు. పదిన్నరదాకా పక్కమీంచి లేస్తేకదూ? నిన్నరాత్రికూడా భోజనం లేదు. ఎంచేతో అట్టే ఆకలిగా లేదంటూ తానూ, గురుమూర్తీ పన్నెండణాల టిఫినుమాత్రం తిన్నారు.

ఈ వెధవ ఒక్కరూపాయీ ఉండి రక్షించేసిందేమిటిలెద్దూ అంటూ ఆహ్వానించింది నాతిదూరంలో నెలకొనిఉన్న కొండొక కాఫ్యాలయం. అట్టే ఆలోచించకుండానే రోడ్డు క్రాస్ చేసేడు. తలవంచుకొని విసురుగా లోన ప్రవేశించేడు. ముందుముందు బల్లల దగ్గర కూర్చోదల్చుకోలేదు.

అద్దానికి ఎదురుగా నిబ్బరంగా కూర్చున్నాడు. ఎందుకయినా మంచిదని చేరుమాలు తీస్తున్న సందర్భంలో ఒకమారు రూపాయి తడిమి చూసేడు. ఉంది, చెల్లుతుంది; మరేం ఫర్వాలేదు, ఆర్డరు చేయవచ్చును. ఒక్కటే చూసుకోవాలి. వీలయినంతగా ఆకలిని నిరోధించే ఘనపదార్థాన్ని ఎంపికచెయ్యాలి... కాఫీదగ్గరే అనుమానం వచ్చింది. ఆ రెండణాలకుకూడా ఏదయినా ఘనపదార్థమే తీసుకుంటే, అబ్బ, ఈసర్వరుగాడి హడావిడి ఒకటి. ఊఁ, కాఫీ తే—ఎంత మహా, పదకొండణాలేకదూ అయింది బిల్లు.

సిగరెట్టుపాకెట్టు పూర్తిగా కొంటే మళ్ళీ బస్సుకి ఎటామటీ అవుతుందేమో? గురుమూర్తి ఆరికయాత్ర విఫలమయితే? ఎందుకూ, ఇప్పటికి అరపెట్టి చాలదూ? ఊఁ, కిల్లీ ఒకటి. టిఫిను తిని, కిల్లీ వేసుకొని సిగరెట్టుని ఆస్వాదిస్తూ ఉంటే, నిజంగా భుక్తాయాసం తీర్చుకొంటున్నట్టే అనిపించింది రాఘవరావుకి. వెధవ బస్సు ఒక్కొక్కప్పుడు ఎంత నిల్చున్నా రాదు. ఇంకా సిగరెట్టు సగమయినా కాలేదు. కానీ, తరవాతది వచ్చేవరకు ఎవడు నిలబడగలడు?

బస్సులో ఆవేళ అణాపరక్కి రూపాయిన్నర సుఖం అనుభవించినట్లనిపించింది; ఎంత గమ్మత్తుగా వచ్చింది చల్లటికునుకు, ఇలా ఇలా సముద్రానికి దూర దూరంగా ఉండగానే. కాని, మరి లాభం లేదు, దిగిపోవాలి. తీరా దగ్గరకి నడిచివెళ్లి కూర్చొనేసరికి ఈ కునుకు అంతర్ధాన మయిపోతుంది.

అబ్బ, ఏమిటో, గురుమూర్తి చాదస్తం. ఈమాత్రం ముందుకి కూర్చోకూడదా? ఇదంతా బీచి కాదా? ఇక్కడ కూర్చున్న ఇందరికీ ఆనందం అక్కరలేదా? పరధ్యానంగా ఉంటే పెద్దకెరటాలకి బట్టలు తడిసిపోతా యన్నంతదగ్గరలో కూర్చోవా లంటాడు. ఆ హోరులో వాడి కేమిటో శాంతీ కాంతీ కనిపిస్తాయిట. ఏమో ఈసరిగా సవ్యంగా వ్యవహారం ఫైసలు చేసుకొని వచ్చిఉంటాడేమో?

ఎలాగో కాళ్లీడ్చుకొని వెళ్లి కూలబడ్డాడు. తమ మామూలుజాగాల్లో చుట్టుపక్కల ఎవళ్లున్నారో ఏమిటో పరిశీలించే కుతూహలంకూడా లేకపోయింది. అలా కట్టిదుక్కను (కట్టమరం) అనుకొని కళ్లుమూసుకొన్నాడు.

అది కల అని కల కాదు- మేలుకొనిఉండడం కాదు. గత ఇరవైనాలుగుసంవత్సరాల చరిత్రా సంక్షిప్తంగా సినీమాలో చూసినట్లు చూడగలుగుతున్నాడు రాఘవరావు. తాను చిన్నప్పుడు స్కూల్లో బాగా పద్యాలు చదివినందుకు బహుమతులు తెచ్చుకొన్న రోజులే తన జీవితంలో ఉత్తమోత్తమమయినవి. వాటిలోని అమాయికానందానుభూతి తనకి ఈ జన్మలోనే మరి రాదేమో? అప్పుడు తనని ఇతరులు మెచ్చుకొంటే అక్కడి కదే లక్ష్యమై తృప్తీ, సంతోషమూ కలిగేవి. ఇప్పుడలాగ కాదే? తనను ఇతరులు మెచ్చుకుంటున్నా భయమే;—ఈ మెచ్చికోలు కేవలం వాళ్ళు కావా లనుకొంటున్న ఆయా లక్షణాలు తనలో ఉన్నా లేకపోయినా వాటికోసమే మెచ్చుకొంటున్నట్టనిపిస్తుంది. పైగా ఈ మెప్పును ఇలా నిలబెట్టుకొనిరావలసిన చిన్నతనంలో లేని బాధ్యత ఒకటి ఇప్పుడుంది. తాను నటించవలసిన నాటకమూ, అందులో తన పాత్రాకూడా సారస్వతదృష్ట్యా, సాంఘికదృష్ట్యా ఇష్టపడాలి విమర్శకులకు. అప్పుడు

తన నిర్వహణచాతుర్యం సరిగ్గా కనిపిస్తుంది. అందులోనూ ఎన్నో అభిప్రాయభేదాలు—అబ్బ! తన పథం ఎంత దుర్గమమయినది! అయితేనేం, తానిప్పుడు దీన్ని విడిచిపెట్టలేడు; తన జీవితంలో ఏమాత్రమయినా సార్థకమయిన పనిఅంటూ ఉంటే అది నాట్యకళా సేవే. దానికి తను చేయవలసిన ఎంత త్యాగానికయినా వెను దియ్యడు; ఇందులో ఎటువంటి సందేహమూ లేదు.

తన విద్యార్థిదశలో తాను నాటకాలలో వేషాలు వేసి ఉండకపోతే ఇప్పటికి ఈవిధంగా తయారయిఉండేవాడు కాడేమో. ఆ వేళ కాలేజీనాటకంలో మొదటి బహుమతి తాను సంపాదించిననాడు, వాళ్ల కలెక్టరుగారు తన నటనాకౌశలాన్ని సభలో ప్రశంసించినందుకు నాన్న ఎంత పొంగిపోలేదు. తరవాత కొన్నాళ్లు ఊరందరితోనూ అదే భోగట్టా కదూ. తాను నాటకంలో బాగా నటించినందుకు కాదు, కలెక్టరుగారి అంతటివాడు తన కొడుకుని సభలో పొగిడేడని ఆ సంతోషం. లేకపోతే, వెధవ నాటకాలు చదువు తగలడ్డానికి వచ్చిపడ్డా యని వాపోయిన మనిషే కదూ—అసలు అప్పట్లో ఆయన సంతోషం కొడుకు ఇవతల బి. యే. పాసయేసరికల్లా అవతల కలెక్టరుగారు మంచి ఉద్యోగం వేయించేస్తాడని. అంతలా సభలో పొగిడినవాడు ఆమాత్రం ఉద్యోగం వేయించడా అని లోపల్లోపల ధీమా. ఆనాటి పొగడ్త తనలోనూ కొంత ఆత్మవిశ్వాసాన్నీ, ఒకవిధమయిన అస్పష్టమయిన భావికార్యక్రమాన్నీ తయారుచెయ్యకపోలేదు. మహానుభావుడు ఎక్కడున్నాడో చంద్రశేఖరన్!—ఒక్క మనిషి ఒక్క సందర్భంలో అన్న మాటలే తనలో ఒకవిధమయిన ఉత్సాహాన్నీ కోరికలనూ, తన తండ్రిలో ఇంకొకవిధమయిన నిబ్బరాన్నీ ఆశలనూ కలిగించేయి.

నిజమే. నాన్న కష్టపడడం లేదని తానూ అనడు. కాని, కాని, ఇంతకాలంగా తన జీవితాన్ని తన ఇష్టం వచ్చినట్లు వెళ్ళబుచ్చి ముసలిఅయిన నాన్న కోసమే తను జీవించగలడా? అయితేమాత్రం, నాన్నకోరికప్రకారం తాను మప్పితంగా గుమాస్తాగిరీ చేసుకోదలచుకొంటేమాత్రం నాన్నకి ఎన్నటికీ మనస్తాపం కలగదని నిబ్బరం ఏమిటి? తాను ఆజన్మాంతం తనది కాదు అనుకొంటున్నపనిలో మగ్గడంమాత్రమే మిగుల్తుంది.

తను కంటున్నవి కలలే కావచ్చును. అయితే అవి నిజమవడానికి అసాధ్యమయిన కలలు కావే? ఇక, తనకు సాధ్యమయిన, తన ప్రధానలక్ష్యానికి విరుద్ధంకాని పద్ధతిని తల్లిదండ్రులను సుఖపెట్టడానికి ఎట్టి అభ్యంతరమూ లేదు. అంతేకాని, కేవలం అందుకోసమే తాను బ్రతికితే ఆ బ్రతుకు వారికి ఎలా ఉన్నా, తనకిమాత్రం అర్థమూ రసమూ లేనిదిగా ఉంటుంది.

అన్నీ నిజమేనయ్యా సవ్యంగా జరిగితే. నాలుగురోజులు జేబులో డబ్బు లేకపోతే అన్ని ఆశలూ, ఆశయాలూ, చర్చలూ, సిద్ధాంతాలూ మూలబడిపోతాయి. లేకపోతే ఒక్క పిసరులో తప్పిపోయిందిగాని, ఇందాకా ఎందుకు వైరిద్దామనుకొన్నావు? ఎవరి కెంత ప్రాప్తో అంతే. అందని మానిపళ్ళకు అఱ్ఱులు చాపి ఏం ఫలితం?

రాఘవరావుకి చాలా కోపం వచ్చింది, తనను ఇంతగా అవమానిస్తున్న తన మనసుమీద. ఛ! ఏమైతే అదవుతుంది—తను తన నిశ్చయానికి కట్టుబడి ఉంటాడు. డబ్బు లేకపోతే ఆ గుమాస్తాగిరీ ఇక్కడే చేస్తాడు; లేదా రోజుకూలీ చేస్తాడు, తన రోజు వచ్చేదాకా. అంతేకాని తన జీవితంలో ప్రధానమయిన దనుకొన్న నాట్యకళని విడిచిపెట్టలేడు. ఇందులో డబ్బు ఉండనీ ఉండకపోనీ, అది వేరే సంగతి. ఇదివరకు తనతో సంబంధం ఉన్న మూడు కంపెనీలు దివాలా తీసేయి. అంతమాత్రంలో తానేం చచ్చిపోయేడా? ఆదర్శానికి కట్టుబడలేని చవట బ్రతుకుకంటే లక్ష్యాన్ని సమీపించే ప్రయత్నంలో చావు మేలు. నాన్న ఇన్నాళ్ళాయి ఎల్లా కాలక్షేపం చేస్తున్నాడో. అలాగే చేస్తాడు; లేదా కొంచెం ఇబ్బందులు పడతాడు. 'నాకు కొడుకు లేనే లేడనుకొంటా నన్నాడు' క్రిందటి మారు తానే దూరం నుండి రాసిన నెమ్మదైన మాటలకు నమ్ముకొని వెళ్ళి ఒక నెల్లాళ్ళు ఊరికినే ఉండేసరికి, పోనీ, అత నలా అనుకొనడమే మంచిది. తాను డబ్బు సంపాదించ గలిగితే అది కేవలం తనకోసమే కాదు. ఆ విషయాన్ని నాన్న ఇప్పుడే ఒప్పుకోకపోయినంతలో తన కేం పరువుతక్కువ లేదు. తన మనస్సాక్షి తనకి తెలుసును. అసలు తాను ఇప్పుడు ఓడిపోయినవాడులాగా, ఇంటికి వచ్చేస్తాననీ, రైలుటిక్కెట్టుకికూడా డబ్బు లేదనీ వైరివ్వడమే నిజమైన పరువుతక్కువ. అంతగా తాను తన కళవళమీద జీవించలేడని స్థిరపడిపోతే ఇక్కడే ఏదో దేవు

శ్మాడుతాడు తప్ప నాన్నని మరి సహాయం అర్థించడు. ఎంత మంచిపనయింది ఇందాకా అక్కడ కిటికీదగ్గిర నలుగురైదుగురు మనుష్యు లుండడం? లేకపోతే ఈ పాటికి టెలిగ్రాము వెళ్ళిపోతూ ఉండేదే. ఆ కాగితం జేబులో ఉండడమూ మంచిది కాదు; చొక్కా జేబులోనే ఉండాలి ఏది చెప్మా—

జేబు తడుముకొంటూ కళ్ళు విప్పేడు రాఘవరావు. అప్పటికప్పుడే వెన్నెల బాగా వచ్చేసింది.

'ఎంతసే పయిందిరా, మూర్తీ నువ్వొచ్చి? ఓహో శర్మగారా? ఎప్పుడొచ్చేడేమిటి?' అంటూ ఇంకా జేబు తడుముకోసాగాడు.

'ఏమిట్రా, పెన్నా వెతుకుతున్నావు? నేనే తీసేను—శర్మగారేదో చిన్నలెక్క వెయ్యవలసి ఉందంటే' అన్నాడు గురుమూర్తి.

అఁహఁ, నా కాసంగతే తెలీదు; మరెవళ్ళైనా అయితే కైంకర్యం చెయ్యడానికి తగినంతగా నిద్రపోయే నన్నమాట. అంతా నాకు మేలుకొనే ఉన్నట్టుంది సుమా' అని పక్క జేబులో దొరికిన ఇందాకటి టెలిగ్రాముఫారం తీసి నలిపి ఉండచుట్టి వస్తూన్న కెరటంమీదికి బలంగా విసిరేడు. అప్పటికిగాని అతనికి సంతృప్తి కలగలేదు.

'ఏమిట్రా అది, అంత కోపంగా విసిరేస్తున్నా?' వన్నాడు గురుమూర్తి.

'ఏమీ లేదు, తరవాత చెప్తాన్లేగాని, నువ్వెళ్ళిన పనేమిటయింది? కాయా పండా?' అన్నాడు రాఘవరావు.

'పండేగాని, పచ్చికాయ దెచ్చి పడవేయ ఫలమౌనె' అని వేమన్నగారన్నారుకదూ. అలాగా పచ్చికాయకు బలవంతంగా ఉబ్బటగొట్టగా ఏర్పడిన పండువంటి పండనుకో. దీని మాటకేం? మనం రోజూ ఇంకా శర్మగారు రాలేదేం చెప్మా అనుకుంటున్నాం కదూ? ఈమధ్యనల్లా చక్కగా కూర్చొని కొత్త నాటకం ఒకటి రాసేసేడట—మూడంకాలు, సుమారు నూటయాభై పేజీ లుండట, ఇక నీదే ఛాన్సు.

'నిజమే. కొత్త నాటకమే అయితే తప్పక నేను కోరినరకందే అయిఉంటుంది. ఏమో నాకు నమ్మకం చాలకుండా ఉంది. గతనెలలో ఆరంభమయినా కాలేదు. అందులోనూ అక్కడికి వెళ్ళడం వ్యవహారం మీద వెళ్ళేడు. ఏమండీ శర్మగారూ నిజమేనా? లేక మనవాడి భావనాతురంగం స్వైరవిహారం సల్పుతూందా?

'భావనమాత్రం ఎందుకు యథార్థం కాకూడదు? నిజమే. మీరు చెప్పినట్లు, గతనెలలో ఇక్కడనించి నేను బయలుదేరేసరికి అనుకోలేదు. అక్కడ వ్యవహారం చాలా వేగంగానే తెమిలిపోయింది. కాని డబ్బు చేతికి రావడానికి కొన్నాళ్ళు ఆగవలసి వచ్చింది. అప్పట్లో స్ఫురించింది. అయితే మరి ఇక్కడికి వచ్చేక ఈ నిత్యకృత్యరథనేమినిస్వనంలో కవితాగానంవంటి అపభ్రంశపు పని సాగదని, ఇక్కణ్ణించి మావాళ్ళు ఉత్తరంమీద ఉత్తరంచొప్పున అరడజను ఉత్తరాలు రాసినా, లక్ష్యపెట్టక, అలా తలుపులు బిగించుకొని కూర్చొని పూర్తిచేసి మరీ వచ్చేను.'

'భేష్! నిజంగా పనివాడితనం అంటే అదిరా మూర్తీ! మనం, వెధవది ఎప్పుడూ తీరిగ్గానే ఉంటాము; ఏదో ఎక్కణ్ణించో ఊడిపడా లంటాముగాని, మనంతట మనం ఏపనీ చెయ్యలేము.'

'అక్కడే నీతో నాకు పడదురా? అన్నీ తలుపులు బిగించుకొని కూర్చుంటే చెయ్యబడేపనులేనా? అక్కడికీ నేను ఊసుపోక గీసిన గీత లన్నిటినీ డబ్బు చేస్తున్నాను. ఏకాంతంగా నిశ్శబ్దంగా కూర్చుంటే సాధ్యమవుతాయా నాట్యసంగీతాలు? వీటి పటాటోపమంతా వీటి కుండాలి. ఇవే ఏమిటి, ఏకళ అయినా అంతే.'

'సరే చాల్లే ఉపన్యాసం గాని, శర్మగారు, భోంచేసి మా లాడ్జికి వచ్చేస్తారా? చదువుకుందాము. నిజంగా ఈవెన్నెలవెలుగు సరిబడేమాటైతే అద్భుతంగా ఉంటుందిగాని, ఏమంటారు?'

'అలాగే, రావడాని కేం గాని, నిన్నామొన్నా సరిగా నిద్రలేదు. రేపింకా నాకు శెలవు ఉంది. నేను ఉదయం ఎనిమిదికల్లా సిద్ధంగా ఉంటాను. మీరు ఉభయులూ మాయింటికి వచ్చేస్తే భోజనమూ కలిసే చెయ్యవచ్చును; రోజల్లా మన ఇష్టంవచ్చినట్లు చర్చించవచ్చును.'

'బాగానే ఉంటుందిగాని, మేము రావడం కంటె, మనం ఘట్టిగా చదువుకొందికీ, నాలుగుసంగతులూ నిష్పూచీగా చర్చించుకొందికీ మాలాడ్జి అయితేనే అనువుగా ఉంటుంది' అన్నాడు గురుమూర్తి.

'అవును, మీరే అటు వచ్చేస్తే ప్రశస్తంగా ఉంటుంది. అయితే కాస్త ముందుగా వాచవి. ఏమిటి

నాటకం పేరు, ప్రధానాంశం, ఎన్ని పాత్రలు, ఎంత కాలం, కేవలం వచనమేనా అక్కడక్కడ గేయాలూ, పద్యాలూ ఉన్నాయా, వ్యావహారికంలో గ్రాంథికపు పాలు ఎంత?'

'అబ్బో! ఇన్ని ప్రశ్నలకి ఒక్కమారు సమాధానం చెప్పడం నాతరమా?' అంటూ శర్మ ఆరంభించేడు.

ఆ ఆరంభించడం రాత్రి తొమ్మిదిన్నర దాటే వరకూ చర్చ అలా సాగుతూ నేఉంది.

ఉందీ లేదూ అన్న రకం ఉద్యోగంతో పెద్ద సంసారాన్ని ఈదుకొని వస్తున్న రచయితా, అంతగా లేకపోలేదు అన్నట్లుగా అప్పుడప్పుడు ఆర్థికలబ్ధి కలిగిన సంగీతప్రియుడయిన చిత్రకారుడూ, ఎప్పుడెప్పుడో తగుమాత్రం ప్రశంసనీ, అంతకంటె తక్కువ డబ్బునీ రుచిచూస్తున్న నాట్యకళాతపస్వీ, దేశభవిష్యత్తునుగూర్చీ, కళాకలాపాన్నిగూర్చీ చర్చిస్తున్నంత సేపూ నిత్యజీవితంలోని తమ వడిదుడుకులను సంపూర్ణంగా విస్మరించగలిగేరు.

భవిష్యత్సంబంధి భావనానౌకలు బహుచిత్రమైనవి; అవి ఒక్కొక్కప్పుడు ఘూర్ణమానమైన వర్తమానసాగరాన్ని అతి తేలికగా దాటించి, అద్భుత శ్రీకల్యాణమయములయిన ఏవో లోకాల్లోనికి తీసుకొనివెళ్తాయి. కాని, మళ్లీ కొంచెం సేపట్లో నే చిత్రంగా ఎప్పటితీరాన్నే విడిచివేస్తాయి. సముద్రం మరీ సంక్షుబ్ధమవుతుంది. లేక తారతమ్యదృష్టిలో అలా కనిపిస్తుందేమో!

(సశేషం)

